www.prajasakti.com
ప్రజాశక్తి
బుధవారం 11 జూన్ 2025
5

డాక్టర్ బిఆర్.అంబేద్కర్
కోనసీమ

ఇసుక టిప్పర్ల స్వాధీనం

ప్రజాశక్తి - కాట్రేనికోన

ఎటువంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న రెండు టిప్పర్లను మంగళవారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఆనాతవరం-పల్లంకుర్రు ప్రధాన రహదారిలో కాట్రేనికోన వైపు వెళ్తున్న లారీలను తనిఖీలు చేపట్టగా ఎటువంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్నట్లు గుర్తించి వాటిని స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ అవినాష్ తెలిపారు. స్వాధీనం చేసుకున్న లారీలను తహశీల్దార్ కోర్టులో హాజరు పర్చగా తహశీల్దార్ సునీల్కుమార్ రూ.22 వేలు జరిమానా విధించినట్లు ఆయన తెలిపారు.

స్వాధీనం చేసుకున్న టిప్పర్లు

చొప్పెల్ల లాకులకు తూట్లు

- వృథాగా పోతున్న సాగునీరు
- ప్రతిపాదనలకు మోక్షం ఎప్పుడో
- పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి - ఆలమూరు

ఖరీఫ్ సాగుకు సన్నద్ధం చేసేందుకు వ్యవసాయ శాఖ అధికారులను రేయింబవళ్లు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. అందుకు అనుగుణంగా రైతులు ఖరీఫ్ సాగుకు సన్నహాల్లో ఉన్నారు. అయితే సాగుకు అవసరమైన నీటిని సరఫరా చేయాల్సిన నీటి పారుదల శాఖ మాత్రం నేటికీ నిర్లక్ష్యంగానే వ్యవహరిస్తుంది. సంబంధిత శాఖ అధికారులు తమ విధి నిర్వహణలో ప్రదర్శిస్తున్న అలసత్వంపై ఉన్నతాధికారులకు ఫిర్యాదులు వెళ్లినా పట్టించుకునే పరిస్థితి కన్పించడం లేదు. మండలంలోని చొప్పెల్ల వద్ద ప్రధాన కాలువ మీద లాకులను బ్రిటీష్ కాలం నాటి ఇంజినీర్లు నిర్మించారు. అవి ఇప్పటివరకు తమ శక్తికి మించి పని చేస్తూ వచ్చాయి. ప్రస్తుతం వాటి తలుపులు శిథిలావస్థకు చేరుకున్నాయి. సాగునీరు వృథాగా పోతున్న సంబంధిత శాఖ అధికారులు పట్టించుకున్న దాఖలాలు కన్పించడం లేదు. పంట కాలువలకు నీరు అందించేందుకు లాకుల వద్ద నీటి ప్రవాహాన్ని నియంత్రణ చేసేందుకు గేటులు తప్పనిసరి. లాకుల వద్ద పడవల ద్వారా రాకపోకల కోసం, నీరు వృథా కాకుండా ఉండటం కోసం చొప్పెల్ల వద్ద రెండు గేట్లను బ్రిటీష్ కాలంలోనే ఏర్పాటు చేశారు. ఈ రెండింటిలో ఒకటి గతంలోనే పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో మరమ్మతులు చేపట్టకుండా దానిని వదిలేశారు. మిగిలిన రెండవ గేటు మూసి ఉన్నప్పటికీ అది కూడా శిథిలావస్థకు చేరి నీరు వృథాగా పోతూ సముద్రంలో కలిసిపోతుంది. ఇప్పటికీ గేటు దుస్థితిని సంబంధిత శాఖ అధికారులు, యంత్రాంగం దృష్టికి రైతులు తీసుకెళ్లారు. అయినా అధికారుల్లో ఏమాత్రం చలనం కన్పించడం లేదు. ఖరీఫ్ సాగు ప్రారంభం అయితే ఈ లాకు వద్ద నీటి ప్రవాహాన్ని నియంత్రించేందుకు గేటు తప్పనిసరి. అయితే ఈ గేటుకు మరమ్మతులు చేపట్టకపోవడంతో సాగునీరు వృథా అయ్యే అవకాశాలు కన్పిస్తున్నాయి. అలాగే ప్రధాన కాలువ పూడిక తీతను దశాబ్ద కాలం క్రితం తీశారు. అప్పటినుంచి ఇప్పటివరకు ప్రధాన కాలువను శుభ్రం చేయకపోవడంతో ఈదురు గాలులకు అక్కడక్కడ పడిన చెట్లు, విరిగిపడిన కొమ్మలు ఎక్కడ చూసినా కనిపిస్తున్నాయి. ఇటీవల కాలంలో వివిధ గ్రామాల పరిధిలో కాలువలోకి వస్తున్న డ్రెయిన్ల ద్వారా వచ్చే చెత్తతో కాలువ నిండిపోయి జాతీయ రహదారిపై వెళ్తుంటే ప్రయాణికులకు దుర్గంధాన్ని వెదజల్లుతుంది. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి తక్షణ చర్యలు చేపట్టాలని రైతాంగం కోరుతుంది. లేనిపక్షంలో ఈ చెత్త పంట కాలువల ద్వారా చేలలోకి కొట్టుకొని వచ్చి పంటలకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని రైతులు వాపోతున్నారు. ఇంతలా ఉంటే సంబంధిత అధికారులు కనీసం పర్యవేక్షణ చేయకుండా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం పట్ల రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. లాకుల గేటును నీటి ప్రవాహం నియంత్రణ కోసం ఏర్పాటు చేసిన రక్షణ గోడలు, రైలింగు నిర్వహణ లేకపోవడంతో శిథిలావస్థకు చేరుకున్నాయి. ఇకనైనా ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని తగు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

లాకులకు మరమ్మతులు చేపడతాం

చొప్పెల్ల లాకుల తలుపులు శిథిలావస్థకు చేరిన మాట వాస్తవమే. పరిస్థితిని ఉన్నత అధికారులకు తెలియపరిచాం. మరమ్మతులు, నిర్వహణ కోసం రూ.9 లక్షలు అంచనా వేసి ప్రతిపాదనలను అధికారులకు నివేదించాం. అధికారుల నుంచి అనుమతి వచ్చిన వెంటనే లాకులకు మరమ్మతు పనులు చేపడతాం. ప్రధాన కాలువ పరిస్థితిని పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదిస్తాం. వారి ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటాం.

–కె.సుబ్బారావు, ఇరిగేషన్ ఎఇ

గడియార స్తంభం సెంటర్లో ధర్నా నిర్వహిస్తున్న వామపక్ష పార్టీలు, ప్రజాసంఘాల నాయకులు

పోలీసులపై కఠిన చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - అమలాపురం

గుంటూరు జిల్లా తెనాలిలో దళిత, మైనారిటీ యువకులపై నడిరోడ్డుపై దాడి చేసిన పోలీసులపై చరక్యలు తీసుకోవాలని వామపక్ష, ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక గడియార స్తంభం సెంటర్లో సిపిఎం, సిపిఐ, రిపబ్లికన్ పార్టీ, కెవిపిఎస్, డిహెచ్పిఎస్, ఎంఆర్పిఎస్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి కె.సత్తిబాబు, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జి.దుర్గాప్రసాద్ మాట్లాడారు. పోలీసు రక్షణ వలయంలో సమాజం నడుస్తున్నదని, అటువంటి రక్షణ వ్యవస్థ తమ చేతిలో ఉన్న లాటిని, తూటాను వినియోగించి దళిత మైనారిటీలపై దాడికి దిగడం మానవి హక్కుల ఉల్లంఘన కిందకు వస్తుందన్నారు. గత వైసిపి ప్రభుత్వంలో డాక్టర్ సుధాకర్పైనా ఇదే రీతిలో దాడి జరిగిందని, డ్రైవర్ సుబ్రహ్మణ్యంను హత్య చేసి డోర్ డెలివరీ చేశారని ఫలితంగా జగన్ ప్రభుత్వం కుప్పకూలిందని గ్రహించుకోవాలన్నారు. ప్రభుత్వాలు మారిన దళితులకు రక్షణ లేకుండా పోయిందని ఈ ఘటన రుజువు చేస్తుందని అన్నారు. ముగ్గురు యువకులు నిజంగా గంజాయి తాగి తప్పు చేస్తే చట్ట ప్రకారం అరెస్టు చేసి శిక్షించాలని, కానీ చట్టాన్ని పోలీసులు చేతుల్లోకి తీసుకుని బహిరంగంగా శిక్షలు వేసేందుకు రాజ్యాంగం ఒప్పుకోదని అన్నారు. రాష్ట్ర హోంమంత్రి అనిత జరిగిన దారుణాన్ని సమర్థించుకోవడం ఆక్షేపణీయమని అన్నారు. ఈ సంఘటనపై రాష్ట్ర ముఖ్యమంత్రి మాట్లాడకపోవడం చాలా దారుణమని అన్నారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు కోరుకొండ చిరంజీవి. జంగం సుబ్బారావు, ఎస్.విజయ్కుమార్, పెయ్యల పరసరాముడు, బాలయోగి, శెట్టిబత్తుల తులసీరావు, పచ్చిమాల శివ, ఖండవల్లి ఏలియా, పాల్గొన్నారు.

అధిక ఫీజులపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - అమలాపురం

అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రయివేటు, కార్పొరేట్ స్కూల్స్ యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్ఎఫ్ఐ) జిల్లా కన్వీనర్ కె.శంకర్ డిమాండ్ చేశారు. మంగళవారం గొల్లగూడెం కార్యాలయంలో ఎస్ఎఫ్ఐ మహిళా కన్వీనర్ శశి అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐఐటి, ఎంసెట్, జెఇఇ మెయిన్స్, నీట్ వంటి పేర్లతో కార్పొరేట్, ప్రయివేటు స్కూల్స్, కళాశాలలో ఇష్టారాజ్యంగా అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని, విద్యార్థులను అధిక ఒత్తిడికి గురి చేస్తున్నారని అన్నారు. ఫీజుల పేర్లతో తల్లిదండ్రులపై అధిక భారాలను మోపుతున్నాయని విమర్శంచారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

కొన్ని తరగతి గదుల్లో ఫ్యాన్స్ లేకుండా, వెలుతురు లేకుండా తరగతుల నిర్వహిస్తున్నారని, నిబంధనలు పాటించని భవనాల్లో తరగతులు నిర్వహిస్తున్నారని అన్నారు. వీటిపై ప్రభుత్వం వెంటనే స్పందించి తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఎస్ఎఫ్ఐ కో కన్వీనర్ కె.ప్రణీత్సాయి, నాయకులు బి.దిలీప్సంతోష్ పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన అవసరం

ప్రజాశక్తి - కె.గంగవరం

రైతులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన పెంచుకోవాలని, తద్వారా సాగులో మంచి ఫలితాలు సాధించవచ్చని వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ కె.రాజశేఖర్ అన్నారు. మంగళవారం మండలంలోని దంగేరు సొసైటీ కార్యాలయ ఆవరణలో రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సాగులో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవడంతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలపై అవగాహనను పెంచుకోవాలన్నారు. వ్యవసాయంలో డ్రోన్ల వినియోగం, భూసార పరీక్షలు, పిఎం కిసాన్, ప్రకృతి వ్యవసాయం వంటి పథకాలను వివరించారు. అనంతరం రైతులకు భూసార పరీక్ష ఫలితాల మినికిట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంజయ్హెగ్డే, కలవచర్ల కృషి విజ్ఞాన కేంద్రం ఎడిఎ రాజశేఖర్, మనోహర్, ఉద్యాన వన అధికారిణి అనూష, మండల వ్యవసాయ అధికారి బి.రవి, సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

సదస్సులో మాట్లాడుతున్న శాస్త్రవేత్త రాజశేఖర్

కుష్టు బాధితులకు కిట్ల పంపిణీ

ప్రజాశక్తి - కె.గంగవరం

మండలంలోని ఎర్ర పోతవరం, కుడుపూరు, అద్దంపల్లి, పేకేరు గ్రామాల్లో లెప్రసీ వ్యాధిగ్రస్తులను గుర్తించి అవసరమైన కిట్లు పంపిణీ చేశారు. జిల్లా పారామెడికల్ అధికారి మాధవరపు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో మంగళవారం ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా అంగవైకల్యం కలిగిన వ్యాధిగ్రస్తులు కళ్ళు, కాళ్లు, చేతులపట్ల ఏటువంటి జాగ్రత్తలు తీసుకోవాలనే అంశాలపై వివరించారు. పిహెచ్సిలో ప్రతి నెల 10వ తేదీన, లెప్రసీ కాలనీలో ప్రతినెల 11వ తేదీన ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. మండలంలో అంగవైకల్యం కలిగిన వ్యాధిగ్రస్తులు 140 మంది వరకు ఉన్నారని, జిల్లా వ్యాప్తంగా 1060 మంది ఉన్నారని, వీరందరికీ ఏడాదిలో 2 దఫాలు ఉచితంగా ఎంసిఆర్ చెప్పుల్స్, అవసరమైన వారికి రీ కన్స్ట్రక్టివ్ సర్జరీ జరిపిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజనల్ నోడల్ ఆఫీసర్ చిక్కాల సూర్యారావు, దంగేరు, పేకేరు పిహెచ్సి ఎంపిహెచ్ఒలు పరమేష్బాబు, మూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

కిట్లు పంపిణీ చేస్తున్న వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది

బిటి రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి - మామిడికుదురు

మండలంలోని లూటుకుర్రు శివాలయం నుంచి పాశర్లపూడిలంక-బాడిలంక వరకు పంచాయతీరాజ్, ఎన్ఆర్ఇజిఎస్ నిధులు రూ.1.99 కోట్లతో బిటి రోడ్ల నిర్మాణ పనులకు మంగళవారం ఎంఎల్ఎ గిడ్డి సత్యనారాయణ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ గిడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో రోడ్లకు పూర్వ వైభవం తెచ్చేలా సిఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సిఎం పవన్కల్యాణ్ శ్రీకారం చుట్టారన్నారు. వేల కోట్ల నిధులతో గుంతలు పూడ్చడం, మరమ్మతులతో పాటు నూతన రోడ్ల నిర్మాణం చేస్తున్నారన్నారు. గత ప్రభుత్వంలో గుంతల మయమైన రోడ్లు నేడు సుందరంగా తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు. గత 30 ఏళ్ల నుంచి కనీస మరమ్మతులకు నోచుకోకుండా ఉన్న ఈ రోడ్ల స్థానంలో బిటి రోడ్లు వేయాలని స్థానిక కూటమి నాయకులు, ప్రజల మేరకు నిధులు మంజూరు చేయడం జరిగిందని అన్నారు. రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేసిన ఎంఎల్ఎకు ప్రజలు అభినందనలు తెలిపారు. రోడ్డు నిర్మాణ పనుల శంకుస్థాపనకు వచ్చిన ఎంఎల్ఎకు కూటమి నాయకులు, కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో నగరం వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ పెనుమాల లక్ష్మి, లూటుకుర్రు, పాశర్లపూడిలంక గ్రామల సర్పంచులు అడబాల రామసత్యనారాయణ, తెలగారెడ్డి సూర్యప్రకాశరావు, పాశర్లపూడి ఉప సర్పంచ్ తుండూరి బుజ్జి, జనసేన నాయకులు విళ్ళ సుబ్బారావు, నగరం వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పినిశెట్టి రామచంద్రశేఖర్, నాయకులు మద్దాల ప్రభాకరరావు, తదితరులు పాల్గొన్నారు.

శంకుస్థాపన చేస్తున్న ఎంఎల్ఎ గిడ్డి సత్యనారాయణ

బాబూరావు ఎన్నిక పట్ల హర్షం

ప్రజాశక్తి - రామచంద్రపురం

నవ్యాంధ్ర ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఎపిఇపిడిసిఎల్ డిస్కం గౌరవ అధ్యక్షులుగా కంచుమర్తి బాబూరావు ఎంపిక పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు. విజయవాడలో జరిగిన యూనియన్ ఎన్నికల్లో బాబూరావు అసోసియేషన్ గౌరవాధ్యక్షులుగా ఎన్నికయ్యారు. ఈ ఎన్నికల్లో ముఖ్య సలహాదారుడుగా గుత్తుల నారాయణరావు, అధ్యక్షులుగా జివిఎస్.ప్రసాద్తో పాటు పదిమంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. రామచంద్రపురం పట్టణానికి చెందిన కంచుమర్తి బాబూరావు వర్తక సంఘం అధ్యక్షులుగాను పనిచేశారు. రాజకీయాల్లో చురుగ్గా ఉండే బాబురావు గౌరవాధ్యక్షులుగా ఎంపిక అవటం పట్ల పట్టణంలోని పలువురు ప్రముఖులు, రాజకీయ నాయకులు ఆయనకు అభినందనలు తెలిపారు.

ఘనంగా శాంతాకుమారి పుట్టినరోజు

ప్రజాశక్తి - అంబాజీపేట

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా సర్పంచుల సమాఖ్య అధ్యక్షురాలు, మాచవరం సర్పంచ్ నాగాబత్తుల శాంతాకుమారి జన్మదిన వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. పలువురు ప్రజా ప్రతినిధులు కూటమి నాయకులు, పంచాయతీ సిబ్బంది కేక్ కట్ చేసే సర్పంచ్ శాంతాకుమారి, సుబ్బారావు దంపతులకి శాలువా కప్పి ఘనంగా సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి దొమ్మేటి వెంకటేశ్వరరావు, మైపాల తాతాజీ, కూటమి నాయకులు సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

కేక్ కట్ చేస్తున్న శాంతాకుమారి దంపతులు

బాల్య వివాహాలను అరికడదాం

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం

బాల్య వివాహాల వలన కలిగే దుష్ఫలితాలను ప్రజలకు వివరించి బాల్య వివాహాలను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సర్పంచ్ ఇసుకపట్ల జయమణి కోరారు. మంగళవారం చల్లపల్లి పంచాయతీ వాసాలతిప్పలో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో కిశోర వికాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో అంగన్వాడీ కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. 11 నుంచి 18 ఏళ్ల లోపు బాలికలకు బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ కౌమార దశలో ఉన్న బాలికలపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ చూపి వారిని ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దాలని సూచించారు.

అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్వాడీలు

తహశీల్దార్లపై దాడులు అరికట్టాలని వినతి

ప్రజాశక్తి - అయినవిల్లి

అయినవిల్లి తహశీల్దార్పై జరిగిన దాడిని నిరసిస్తూ జిల్లాకు చెందిన పలువురు తహశీల్దార్లు కలెక్టర్ షాన్మోహన్ సగిలికి మంగళవారం వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా తహశీల్దార్లు మాట్లాడుతూ అయినవిల్లి తహశీల్దార్పై దాడి చేసిన వ్యక్తికి మండలంలో ఏ విధమైన భూములు లేవన్నారు. అతనికి సంబంధించి ఏ విధమైన కార్యాలయాలు, కార్యక్రమాలకు సంబంధించి ఏవీ పెండింగ్లో లేనప్పటికీ కక్షపూరితంగా వచ్చి దాడి చేసినట్లు తెలిపారు. సంబంధిత వ్యక్తిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయంలో అయినవిల్లి తహశీల్దార్ నాగలక్ష్మమ్మకు సంఘీభావాన్ని తెలియజేస్తూ దాడి చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకునేంత వరకూ అందరం తోడుగా ఉంటామని కలెక్టర్కు వివరించారు. ఘటన జరిగిన వెంటనే కలెక్టర్, జాయింట్ కలెక్టర్, ఎస్పి వెంటనే స్పందించినందుకు యూనియన్ తరపున ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎపి ఆర్ఎస్ఎ, ఎపి జెఎసి అధ్యక్షులు డి.శ్రీనివాస్, జిల్లావ్యాప్తంగా వివిధ మండలాల తహశీల్దార్లు, డిటిలు పాల్గొన్నారు.

కలెక్టర్కు వినతిపత్రం ఇస్తున్న తహశీల్దార్లు

మణికుమార్కు డాక్టరేట్

ప్రజాశక్తి - పి.గన్నవరం

ఉడిమూడి గ్రామ పరిధిలోని ఆదిమూలంవారిపాలెం వాసి తిరుమనాథం కోటి మణికుమార్ డాక్టరేట్ అందుకున్నారు. 'హైబ్రిడ్మెషిన్ లెర్నింగ్ టెక్నిక్ ఫర్ ఫోర్ కాస్టింగ్ స్టూడెంట్ అకాడమిక్ పెర్ఫార్మెన్స్ యూసింగ్ ఈ-లెర్నింగ్ డేటా మైనింగ్' సిద్ధాంత వ్యాసంకి భారత్ యూనివర్సిటీ అధికారులచే ఆమోదముద్ర పొంది చెన్నై (సిఎస్ఇ) విభాగం ప్రొఫెసర్ డాక్టర్ ఎస్.తయ్యాల్ నాయగి పర్యవేక్షణలో డాక్టరేట్ అందుకున్నారు. ఈ పరిశోధన ద్వారా అభివృద్ధి చేసిన మిషన్ లెర్నింగ్ మోడల్ విద్యార్థుల విద్యా ప్రదర్శనను ముందుగా అంచనా వేయటంలో సహాయపడుతుందన్నారు. విద్యార్థి శైలి ఆసక్తులకు అనుగుణంగా అభ్యాసాన్ని అలవర్చే అవకాశం ఇస్తుందని, విద్యా విధాన రూపకల్పనకు శాస్త్రీయ ఆధారంగా సహకారం అందిస్తుందని విద్యా సమానత్వం కల్పిస్తుందని అన్నారు. ప్రస్తుతం మణికుమార్ సర్ సిఆర్.రెడ్డి కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్ అసిస్టెంట్ ప్రొఫెసర్గా పని చేస్తున్నారు. డాక్టరేట్ అందుకున్న మణికుమార్కు పలువురు అభినందనలు తెలిపారు.

డాక్టరేట్ను అందుకుంటున్న మణికుమార్



ఇచ్చిన హామీలు అమలు చేయాలి

ప్రజాశక్తి - రామచంద్రపురం

ఎన్నికల సమయంలో విద్యార్థులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం(పిడిఎస్యు) రాష్ట్ర సహాయ కార్యదర్శి బి.సిద్దు డిమాండ్ చేశారు. మంగళవారం ద్రాక్షారామంలోని గుర్రాల పరంజ్యోతి గ్రంథాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 12వ తేదీ నుంచి విద్యా సంవత్సరం ప్రారంభమవుతుందని తెలిపారు. అయితే కూటమి ప్రభుత్వం 2024 ఎన్నికల్లో విద్యార్థుల తల్లిదండ్రులకు ఇచ్చిన 'ప్రతి విద్యార్థికి తల్లికి వందనం', ఎస్సి, ఎస్టి, బిసి, ఒసి ఇతర పేద విద్యార్థులకు ఫీజు రీయింబర్స్మెంట్, స్కాలర్షిప్, ప్రభుత్వ యూనివర్సిటీలు, పాఠశాలలు, హాస్టల్స్లో మెరుగైన సౌకర్యాలు కోసం బడ్జెట్లో అధిక శాతం నిధులు కేటా ఇస్తామని, మెగా డిఎస్సి ద్వారా 50 వేల టీచర్ పోస్టులు భర్తీ చేస్తామని, నిరుద్యోగ భృతి అందిస్తామని, విద్యాహక్కు చట్టాన్ని పటిష్టంగా అమలు చేస్తామని, జర్నలిస్టుల పిల్లలకు 50 శాతం ఫీజు రాయితీ ఇస్తామని ఇచ్చిన ఒక్క హామీని కూటమి ప్రభుత్వం అమలు చేయలేదని విమర్శంచారు. ప్రభుత్వం ఇప్పటికైనా తల్లికి వందనం పథకాన్ని జూన్ 15లోగా ఇవ్వాలని, రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్లో ఉన్న రూ.8 వేల కోట్ల బకాయిలను విడుదల చేయాలని, నూతన జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేయాలని, రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ 2025- 26 విద్యా సంవత్సరానికి కార్పొరేట్, ప్రయివేటు విద్యాసంస్థల్లో ఫీజుల నియంత్రణ చట్టాన్ని అమలు కోసం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సమావేశంలో మాట్లాడుతున్న పిడిఎస్యు నాయకుడు సిద్దు

క్షేత్రస్థాయి పరిశీలన చేస్తున్న డిసి అధ్యక్షుడు మెర్ల, డ్రెయిన్స్ డిఇ పోచారావు

పూడిక తీత పనులు వేగవంతం

ప్రజాశక్తి - ఆలమూరు

స్థానిక డిసి పరిధిలోని మడికి నుంచి మండపేట వరకు విస్తరించి ఉన్న మురికి నీటి కాలువలో పూడిక తీత పనులు వేగవంతంగా జరుగుతున్నాయని డిసి అధ్యక్షుడు మెర్ల గోపాలస్వామి, డ్రెయిన్స్ డిఇ పోచారావు తెలిపారు. మంగళవారం మండలంలోని మోదుకూరు వద్ద డ్రెయిన్ తవ్వకం పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంటకాలువలకు ఆనుకుని ఉన్న మురికినీటి ప్రవాహం వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రైతుల పంటలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా, స్థానిక అధికారులతో కలిసి కాలువ శుభ్రత పనులను చేపట్టినట్లు తెలిపారు. మురికినీటి కాలువ వల్ల సాగులో ఉన్న పంటలు ఎండిపోవడం, కీటకాల విజృంభణ వంటి సమస్యలు తలెత్తకుండా ముందుస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు. రైతుల పంటల సాగుకు అనుకూల వాతావరణం ఏర్పడి, అడ్డంకులు తొలగినట్లు అవుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ ఎఇ సుబ్రహ్మణ్యం, చొప్పెల్ల కాలువ సాగునీటి సంఘం వైస్ ఛైర్మన్ పాలచర్ల సత్యనారాయణ, రైతులు, ఇరిగేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

మెరిట్ విద్యార్థులకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి - మామిడికుదురు

మండలంలోని 11 హైస్కూల్స్లో 10వ తరగతిలో ఉత్తమ ప్రతిభను చాటుకున్న ఎస్సి విద్యార్థులకు బళ్ల పుల్లయ్యదాసు, భారతి జ్ఞాపకార్థం వారి కుమారుడు దుర్గాప్రసాద్ ఒక్కొక్కరికి రూ.1000 చొప్పున ఆర్థిక సాయం, మెమొంటోను మంగళవారం అందచేశారు. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ 134 జయంతి సందర్భంగా ఆదుర్రు శివారు మోరిపాలంలో మే 11న జరిగిన జయంతిలో టెన్త్ ప్రతిభవంతులను గుర్తించారు. ఈ కార్యక్రమంలో యువజన సంఘం అధ్యక్షులు హర్ష దాకే, యెల్లమెల్లి నానాజీ, కొల్లాబత్తుల బెన్నీరాజు, భూపతి శరత్, వై.శ్రీహర్ష, కొంబత్తుల రాంజీసుమన్, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మెమొంటోలతో ఉత్తమ విద్యార్థులు

నేరాలు ఘోరాలు

సముద్రంలో ఇద్దరు గల్లంతు

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం

ఎస్.యానం బీచ్‌లో స్నానం చేసేందుకు సముద్రంలో దిగి ఇరువురు యువకులు గల్లంతయ్యారు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం..మంగళవారం సాయంత్రం అంబాజీపేట మండలం మాచవరంకు చెందిన యాళ్ళ హరికిషోర్(19), అయినవిల్లి మండలం నేదునూరుకి చెందిన ఇసుకపట్ల జస్వంత్(19) నేదునూరుకు చెందిన మరో ముగ్గురు యువకులు ఎస్.యానం బీచ్‌కు వచ్చి స్నానం చేసేందుకు సముద్రంలోకి దిగారు. వీరిలో యాళ్ల హరికిషోర్, ఇసుకపట్ల జస్వంత్ సముద్రంలో గల్లంతయ్యారు. గల్లంతైన యువకుల కోసం ఎస్ఐ సిహెచ్.రాజేష్, పోలీసు సిబ్బంది గాలింపు చర్యలు చేపట్టగా హరికిషోర్ మృతదేహం లభ్యం కాగా, జస్వంత్ కోసం గాలింపు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పురుగుల మందు తాగిన యువకుడు మృతి

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం

పురుగుల మందు తాగిన ఒక యువకుడు మంగళవారం మృతి చెందినట్లు ఎస్ఐ సిహెచ్.రాజేష్ తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం..మండలంలోని గొల్లవిల్లి పంచాయితీ వాడపర్రుకు చెందిన కమిడి సురేష్(25) ఈనెల 7న పురుగుల మందు తాగాడు. కుటుంబీకులు అతనిని అమలాపురంలోని ఓ ప్రయివేట్ ఆసుపత్రికి తరలించారు. అనంతరం కిమ్స్ ఆసుపత్రిలో చేర్పించగా అక్కడ చికిత్స పొందుతూ ఆరోగ్యం విషమించడంతో సోమవారం రాత్రి మృతి చెందాడు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గోదావరిలో పడి యువకుని మృతి

ప్రజాశక్తి - రామచంద్రపురం

కోటిపల్లి వద్ద గోదావరిలో నపడి యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..మండలంలోని తోటపేట గ్రామానికి చెందిన అల్లం రాజేష్ సోమవారం తెల్లవారుజామున కోటిపల్లి సోమేశ్వర స్వామి ఆలయానికి వెళ్తున్నానని చెప్పి బయటకు వెళ్లాడు. మంగళవారం మధ్యాహ్నం వరకు అతను తిరిగి రాకపోవడంతో బంధువులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మంగళవారం సాయంత్రం అతని మృతదేహం కోటిపల్లి సుందరపల్లి గోదావరి మధ్యలో లభించింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రామచంద్రపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కె.గంగవరం ఎస్ఐ జానీభాష తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

చోరీ కేసుల్లో ఇద్దరు అరెస్ట్

ప్రజాశక్తి - కొవ్వూరు

కొవ్వూరు రూరల్, సమిశ్రగూడెం, తాళ్లపూడి స్టేషన్ల పరిధిలో చోరీలకు పాల్పడిన ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్లు రూరల్ సిఐ కె.విజయ్‌బాబు తెలిపారు. వీరి నుంచి రెండు కేసులకు సంబంధించి రూ.10లక్షల విలువైన 125 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. నెల్లూరు జిల్లా బిట్రగుంటకి చెందిన మారుబోయిన మాల్యాద్రి, పశ్చిమగోదావరి జిల్లా రాయలం గ్రామానికి చెందిన తోటకూర రామకృష్ణంరాజులను అరెస్ట్ చేశామన్నారు. దేవరపల్లి వైపు నుంచి కొవ్వూరు వైపు కారులో వేగంగా వస్తుండడంతో అనుమానంతో విచారించగా నేరాలు బయట పడ్డాయన్నారు. నిందితుల నుంచి చోరీ సొత్తు రికవరీ చేశామన్నారు. కారులో వచ్చిన నరసాపురానికి చెందిన మరో నిందితుడు సద్దుల కుమార్‌రాజా పరారీలో ఉన్నట్లు సిఐ తెలిపారు. అరెస్ట్ చేసిన ఇద్దరు నిందితులను మంగళవారం రిమాండ్‌కు తరలించామన్నారు. రూరల్ ఎస్ఐ కె.శ్రీహరితోపాటు, క్రైమ్ ఎస్ఐ పి.రవీంద్రబాబు సిబ్బందిని ఆయన అభినందించారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి - కాజులూరు

కుటుంబ తగదాల నేపథ్యంలో సోమ వారం సాయంత్రం ఒక వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల కథనం ప్రకారం గొల్లపాలెంలో సుందరపల్లి శేషారావు (39) జీడి మామిడి చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం తెలుసుకుని పోలీసులు కుటుంబ సభ్యులు సహకారంతో కాకినాడ ప్రభుత్వాసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. శేషారావుకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఎస్ఐ మోహన్ కుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

రైలు ఢీకొని గుర్తు తెలీని వ్యక్తి మృతి

ప్రజాశక్తి - సామర్లకోట

సామర్లకోట రైల్వే స్టేషన్‌లో పట్టాలు దాటుతుండగా ప్రమాదవశాత్తు రైలు ఢీకొనడంతో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. రైల్వే ఎస్ఐ పి.వాసు అందించిన వివరాల ప్రకారం మంగళవారం రైలు పట్టాలు దాటుతుండగా ప్రమాదవశాత్తు రైలు ఢీకొని వ్యక్తి మృతి చెందాడు. మతుడు తెలుపు రంగు చొక్కా, నీలం రంగు లుంగీ ధరించి ఉన్నాడు. మతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించగా అతని ఆచూకీ కోసం పోలీసులు ప్రయత్నాలు చేస్తున్నారు. ఎస్ఐ వాసు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పేకాట శిబిరంపై పోలీసుల దాడి

ప్రజాశక్తి - గొల్లప్రోలు

పట్టణంలోని సాయిబాబా గుడి వెనుక పేకాట ఆడుతున్న శిబిరం పై పోలీసులు దాడులు నిర్వహించారు ఈ దాడిలో పేకాట ఆడుతున్న ఏడుగురిని అదుపులోనికి తీసుకుని వారి వద్ద నుండి 1720 నగదు స్వాధీన చేసుకున్నారు. వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గొల్లప్రోలు ఎస్ ఐ ఎన్ రామకష్ణ తెలిపారు

తప్పిపోయిన బాలుడు సురక్షితం

ప్రజాశక్తి - గొల్లప్రోలు

తప్పిపోయిన మూడేళ్ల బాలుని గంట వ్యవధిలో కనుగొని పోలీసులు తల్లిదండ్రులకు అప్పగించారు. పట్టణంలోని బిసి కాలనీకి చెందిన పప్పిరెడ్డి పాపారావు, కావ్యల కొడుకు రిత్విక్ శ్రీహాన్‌తో మార్కెట్ సెంటర్‌లోని పాపారావు సోదరుని ఇంటికి వెళ్లారు. శ్రీహాన్ ఉదయం 11 గంటలకు కనిపించకుండా పోయాడు. వెంటనే పాపారావు దంపతులు గొల్లప్రోలు పోలీసులను ఆశ్రయించారు. ఎస్ఐ ఎన్.రామకృష్ణ వెంటనే పోలీస్ సిబ్బందిని అప్రమత్తం చేసి బాలుని ఆచూకీ కోసం గాలింపు చేపట్టారు. జాతీయ రహదారిలోని అపర్ణ హోటల్ వద్ద బాలుని గుర్తించి వారి తల్లిదండ్రులకు అప్పగించారు. సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు.

వర్షం కోసం ఎదురుచూపులు

- జాడలేని నైరుతి రుతుపవనాలు
- నెర్రలు వారిన పంట పొలాలు
- ఆలస్యం అవుతున్న ఖరీఫ్ సేద్యం

ప్రజాశక్తి - రామచంద్రపురం

ఈ ఏడాది వర్షాలు అనుకున్న సమయానికి ముందే కురుస్తాయని, నైరుతి రుతుపవనాలు మే చివరివారానికి రాష్ట్రాన్ని తాకాయని వాతావరణ శాఖ ప్రకటించడంతో రైతులు తొలకరి సాగుకు ఎంతో ఆశతో ఎదురుచూస్తున్నారు. అయితే నైరుతీ రుతుపవనాలు జాడ కానరావడం లేదు. జూన్ నెలలో ఇప్పటికే 10 రోజులు గడిచిపోయాయి. నైరుతీ రుతుపవనాల వర్షాలు కురిస్తే తొలకరి సేద్యం ప్రారంభించేందుకు రైతులు సిద్ధంగా ఉన్నప్పటికీ వాతావరణం అనుకూలించకపోవడం, ఎండల తీవ్రత 40 డిగ్రీలుపైగా నమోదు కావడం, గోదావరి డెల్టా పంట కాలువలకు ఇంకా సాగునీరు అందకపోవడంతో తొలకరి సేద్యం మరింత ఆలస్యం అయ్యేలా కనిపిస్తుంది. మే నెలలో కురిసిన అకాల వర్షాలకు దాళ్వాలో రైతులు ఆధారాబాదరాగా ధాన్యం ఒబ్బిడి చేసుకుని నేటికీ అమ్మకాలు కొనసాగిస్తున్నారు. అనుకున్న సమయానికి తొలకరి వర్షాలు కురిస్తే జూన్ మొదటి వారంలో ఆకుమడులు సిద్ధపడతారు. అయితే ఒకపక్క ఋుతుపవనాలు ఎటు పోయాయో అర్థం కాని పరిస్థితి నెలకొంది. దీంతో రైతులు గోదావరి నది జలాలపై ఆధారపడి వ్యవసాయం చేసేందుకు సిద్ధమవుతున్నారు. ఈ నేపథ్యంలో పంట కాలువలు శివారు ప్రాంతాలకు ఇంకా సాగునీరు అందకపోవడంతో రైతులు తొలకరి సేద్యంపై అయోమయానికి గురవుతున్నారు.

ఇప్పటికే విత్తనాలను సిద్ధం చేసుకున్న రైతులు ఆకుమడులకు అవసరమైన నీటి కోసం ప్రకృతి, పంట కాలువలపైన ఆధారపడి ఎదురు చూస్తున్నారు. ప్రస్తుతం పంట పొలాలన్నీ నెరలు వారి తొలకరి వర్షం కోసం ఎదురుచూస్తున్నాయి. పంట పొలాల్లో ఒకవైపు భారీ వృక్షాలు, మొక్కలు సైతం తొలకరి వర్షం కోసం ఎదురుచూస్తున్నాయి. వర్షాలు పడిన వెంటనే రైతులు తొలకరి పనులు ప్రారంభిస్తారు. అయితే కొంతకాలంలో సాగునీరు లభ్యత ఎప్పటికీ సాధ్యమవుతుందోనని రైతులు ఎదురుచూస్తున్నారు. అనుకున్న సమయానికి వర్షాలు రాకపోవడం పంట కాలువలకు నీరు రాకపోవడంతో ఈ ఏడాది తొలకరి సేద్యం బాగా ఆలస్యం అయ్యే సూచనలు కనిపిస్తున్నాయని రైతులు మదన పడుతున్నారు.

విత్తనాలు సిద్ధం

తొలకరి సేద్యం చేసే రైతులకు విత్తనాలను సిద్ధంగా ఉన్నాయి. స్వర్ణ విత్తనాలు 1200 క్వింటాళ్ళు, ఎంటియు రకం 1318 విత్తనాలు 120 క్వింటాళ్లు సొసైటీలు, ప్రయివేటు డీలర్ల వద్ద ఉన్నాయి. రైతు సేవా కేంద్రాల్లో 150 క్వింటాళ్ల విత్తనాలు అందుబాటులో ఉన్నాయి.

-బలుసు రవి, మండల వ్యవసాయ అధికారి.

జాప్యం లేకుండా సిఎస్ఆర్ నిధులు ఇవ్వాలి

ప్రజాశక్తి - అమలాపురం

మాట్లాడుతున్న కలెక్టర్ మహేష్‌కుమార్

జిల్లాల్లో చమురు సహజవాయువుల నిక్షేపాలను వెలికి తీసి తరలిస్తున్న చమురు సంస్థలు విడుదల చేసే సిఎస్ఆర్ నిధులను ఎప్పటికప్పుడు విడుదల చేయాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో ప్రజాప్రతినిధులు, చమురు సంస్థల ప్రతినిధులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. గత ఏడాది, ప్రస్తుత సంవత్సరానికి సంబంధించిన సిఎస్ఆర్ నిధులు వినియోగంపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఒఎన్‌జిసి, గెయిల్ సంస్థలు సిఎస్ఆర్ కింద కేటాయించే నిధులతో జిల్లాలో అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు రూపొందించి పంపడం జరుగుతుందని తెలిపారు. ఎప్పటికప్పుడు నిధులు కేటాయిస్తూ జిల్లా అభివృద్ధిలో కీలక భూమిక పోషించాలని సూచించారు. అదేవిధంగా ప్రజాప్రతినిధులు ప్రాధాన్యత క్రమంలోనే అభివృద్ధి పనులను ప్రతిపాదిస్తున్నారని, ఆ దిశగా చమురు సంస్థలు సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు. 2025 -26 ఆర్థిక సంవత్సరానికి చమురు సంస్థలకు సిఎస్ఆర్ నిధుల లక్ష్యాలను నిర్దేశించారు. సిఎస్ఆర్ సమావేశాలకు బాధ్యత గల అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని స్పష్టం చేశారు. కొత్తపేట, రాజోలు, మండపేట, ముమ్మిడివరం నియోజకవర్గాలలో ప్రతిపాదిత పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు సకాలంలో నిధులు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో అంచనాల కమిటీ ఛైర్మన్, ఎంఎల్ఎ వేగుళ్ల జోగేశ్వరరావు, ఎంఎల్ఎలు దాట్ల సుబ్బరాజు, బండారు సత్యానందరావు, దేవ వరప్రసాద్, ఒఎన్‌జిసి, గెయిల్ ప్రతినిధులు రాజురాంజీ, సునీల్‌కుమార్, శాస్త్రి, రామారావు, తదితరులు పాల్గొన్నారు.

7న ఎంఆర్‌పిఎస్ ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి - ఆత్రేయపురం

జూలై 7న జరిగే ఎంఆర్‌పిఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని గ్రామ గ్రామాన నిర్వహించాలని ఎంఆర్‌పిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు కొమ్మర రాఘవులు పిలుపునిచ్చారు. మంగళవారం మండలంలోని మెర్లపాలెంలో నియోజకవర్గ స్థాయి ఎంఆర్‌పిఎస్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూల మాలలు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల, గ్రామ కమిటీలను నూతనంగా వేసుకోవాల్సివుందన్నారు. జూలై 7న జరిగే ఎంఆర్‌పిఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ప్రతీ గ్రామంలో జెండాను ఎగురు వేయాలని తెలిపారు.

జర్నలిస్టులపై దాడులు అరికట్టాలి

ప్రజాశక్తి - అయినవిల్లి

మండలానికి చెందిన సాక్షి విలేకరి రాముపై దాడి చేసిన వారిని శిక్షించాలని పలువురు జర్నలిస్టులు కోరారు. మంగళవారం తహశీల్దార్ కార్యాలయంలో జర్నలిస్టులు వినతిపత్రాన్ని అందజేశారు. ఎవరినైనా ప్రశ్నించే హక్కు మీడియా ప్రతినిధులకు ఉందని, ఏమైనా పొరపాట్లు జరిగితే సంబంధిత సంస్థలకు ఫిర్యాదు చేసుకోవాలి, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కానీ ఇలా భౌతికదాడులకు పాల్పడటం సరికాదన్నారు. దాడి చేసిన వారిపై చట్ట ప్రకారం ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

పలు భవనాలను ప్రారంభించిన ఎంఎల్ఎ

ప్రజాశక్తి - మండపేట

పట్టణంలో ప్రభుత్వ నిధులతో నిర్మించిన పలు భవనాలను రాష్ట్ర అంచనాల కమిటీ ఛైర్మన్, ఎంఎల్ఎ వేగుళ్ల జోగేశ్వరరావు మంగళవారం ప్రారంభించారు. పురపాలక సంఘ సాధారణ నిధులు రూ.19 లక్షలతో నిర్మించిన బిసి కమ్యూనిటీ హాల్‌తోపాటు, 19వ వార్డులో నిర్మించిన డొక్కా సీతమ్మ మహిళా స్వశక్తి భవనంలో రూ.43.87 లక్షలతో ఏర్పాటు చేసిన మౌలిక సదుపాయాలను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ ఛైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్, పట్టణ టిడిపి అధ్యక్షులు మత్సా నాగబాబు, మాజీ అధ్యక్షులు ఉంగరాల రాంబాబు, మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ మందపల్లి దొరబాబు, తూర్పుకాపు కార్పొరేషన్ డైరెక్టర్ గడి సత్యవతి, టిఎన్‌టియుసి రాష్ట్ర ప్రతినిధి వాదా ప్రసాదరావు, మండపేట మార్కెట్ కమిటీ ఛైర్మన్ చింతపల్లి రామకృష్ణ, మున్సిపల్ వైస్ ఛైర్మన్ పిల్లి గణేశ్వరరావు, టీడీపీ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ప్రతిభ పురస్కారానికి బేతని విద్యార్థులు

ప్రజాశక్తి - కాట్రేనికోన

విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపల్

రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ప్రతిభా పురస్కారం 2025 అవార్డులకు ఉప్పూడి బేతని స్కూల్‌కి చెందిన మట్టపర్తి లక్ష్మి, కొప్పాడి జ్యోతి, పోలిశెట్టి ప్రణతి ఎంపికైనట్లు బేతని స్కూల్ ప్రిన్సిపల్ ఎలిజబెత్‌రాణి తెలిపారు. తమ విద్యార్థులు కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ చేతుల మీదుగా బహుమతులు అందుకున్నారని తెలిపారు. విజేతలను ఉపాధ్యాయులు అభినందించారు.

ప్రజల దృష్టిని మళ్లించేదుకే సాక్షిపై దాడి

ప్రజాశక్తి - అమలాపురం

కూటమి ప్రభుత్వ వైఫల్యాలపై ప్రజల దృష్టిని మళ్లించేందుకే సాక్షి కార్యాలయాలపై దాడులు చేస్తున్నారని వైసిపి నాయకుడు కుంచే రమణారావు మంగళవారం ఒక ప్రకటనలో విమర్శించారు. అమరావతి అంశంపై సాక్షి ఛానల్‌లో వచ్చిన ప్రచారంపై ప్రభుత్వం చట్టపరమైన చర్యలకు దిగిందని, మరోవైపు సాక్షి కార్యాలయాలపై టిడిపి కార్యకర్తలు దాడులకు తెగబడి ఆస్తులు ధ్వంసం చేయడం దారుణమన్నారు. పత్రికా కార్యాలయాలపై దాడులు చేయడం హేయమైన చర్య అని అన్నారు. దాడులకు పాల్పడిన టిడిపి మూకలపై తక్షణం చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

ముగిసిన కిశోర వికాసం కార్యక్రమం

ప్రజాశక్తి - రావులపాలెం

మండలంలో కిశోర వికాసం వేసవి శిక్షణా కార్యక్రమాలు ముగిశాయి. మంగళవారం మండలంలోని పొడగట్లపల్లిలో ఐసిడిఎస్ సూపర్ వైజర్ నాగసత్యవేణి ఆధ్వర్యంలో ముగింపు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మే 2 నుంచి జూన్ 10 వరకు ప్రభుత్వం తలపెట్టిన కిశోర వికాసం శిక్షణా బాలికలకు ఎంతగానో దోహద పడ్డాయని అన్నారు. ఈకార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, పాల్గొన్నారు.

54వ రోజుకు రిలే నిరాహార దీక్ష

ప్రజాశక్తి - మండపేట

మండలంలోని కేశవరం గ్రామం జడ్‌పి హైస్కూల్‌కు ప్రహరీ గోడను నిర్మించాలని వల్లూరు శ్రీవాణి చేస్తున్న రిలే నిరాహార దీక్ష మంగళవారం నాటికి 54 వరోజుకు చేరింది. ఈ సందర్భంగా శ్రీవాణి మాట్లాడుతూ కేశవరం హైస్కూల్‌కు ప్రహరీ గోడ నిర్మించేంత వరకూ తన ఆందోళన కొనసాగుతుందన్నారు. తాను చేపట్టిన దీక్షను భగ్నం చేసేందుకు ఫోన్ చేసి కొందరు భయపెడుతున్నారని, వారు ఎన్ని ప్రయత్నాలు చేసినా హైస్కూల్‌కు ప్రహరి గోడ కట్టే వరకు దీక్షను కొనసాగిస్తానని అన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని కోరారు.

బాల కార్మికులను పాఠశాలల్లో చేర్పించాలి

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం

బాల కార్మికులను గుర్తించి వారిని పాఠశాలల్లో చేర్పించే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఎంపిడిఒ జి.రాజేంద్రప్రసాద్ అన్నారు. జూన్ 12న జరిగే ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం సందర్భంగా చేపట్టే కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఎంపిడిఒ మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో మంగళవారం నుంచి 12 వరకు బాల కార్మికులను గుర్తించే కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో శ్రమ కోఆర్డినేటర్ నాగేశ్వరి, శ్రమ బృందం రమణయ్య, భవాని, శారద పాల్గొన్నారు.

ఫ్యామిలీ ఫిజీషియన్ వైద్య సేవలు

ప్రజాశక్తి - అంబాజీపేట

వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ సూర్యగణేష్

మాచవరం-4 సచివాలయంలో డాక్టర్ ఎ.సూర్య నగేష్ ఆధ్వర్యంలో మంగళవారం ఫ్యామిలీ ఫిజీషియన్ వైద్య సేవలు అందించారు. చిన్న చిన్న వ్యాధులకు చికిత్స చేసి ఉచితంగా మందులు అందజేశారు. బెడ్ రెస్ట్ తీసుకుంటున్న రోగులను, డయాలసిస్, గర్భిణులు, బాలింతల ఇంటి వద్దకు వెళ్లి వైద్య సేవలు అందించడమే కాకుండా ప్రభుత్వం నుంచి వచ్చే ప్రోత్సాహకాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో స్థానిక పిహెచ్‌సి సిహెచ్‌ఒ బి.అప్పారావు, హెల్త్ అసిస్టెంట్ వి.మురళీకృష్ణ, ఎఎన్ఎం ఎం.అర్జమ్మ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

తాతపూడిలో ఇంటింటా సర్వే

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం

మండలంలోని అంగర పిహెచ్‌సి పరిధిలోని తాతపూడి గ్రామంలో మంగళవారం వైద్య బృందంచే ఇంటింటా సర్వే నిర్వహించారు. రంగరాయ మెడికల్ కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ పి.సుజాత ఆధ్వర్యంలో పీజీ విద్యార్థులు నాలుగు బృందాలుగా గ్రామంలో ఇంటింటికీ వెళ్లి సర్వే చేశారు. క్షేత్రస్థాయిలో చేసిన ఎన్‌సిడి 3.0 సర్వే నివేదికను ప్రభుత్వానికి అందజేయనున్నట్లు జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ పి.సుమలత తెలిపారు. ఈ సర్వేలో అంగర పిహెచ్‌సి వైద్యాధికారిణి డాక్టర్ పిఎస్ఎస్‌డి. రత్నకుమారి, ఎంపిహెచ్‌ఇఒ జె.మల్లిఖార్జునుడు, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ బి.రామారావు, హెల్త్ విజిటర్ టి.మేరీమణి, ఎం ఎల్‌హెచ్‌పిలు, ఆశ కార్యకర్తలు, పాల్గొన్నారు.

కమిషనర్‌గా నిర్మల్‌కుమార్ నియామకం

ప్రజాశక్తి - అమలాపురం

అమలాపురం మున్సిపాలిటీ కమిషనర్‌గా బాపట్లకు చెందిన వడాలశెట్టి నిర్మల్‌కుమార్ నియమితులయ్యారు. ప్రస్తుతం నిర్మల్ కుమార్ అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్‌గా పనిచేస్తున్నారు. తాడేపల్లి, బాపట్ల కమిషనర్‌గా పనిచేసిన ఆయన అమలాపురం మున్సిపల్ కమిషనర్‌గా ప్రభుత్వం నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

12న విజయోత్సవ ర్యాలీ

ప్రజాశక్తి - ఆలమూరు

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది పూర్తయిన సందర్భంగా 12న రావులపాలెంలో ఎంఎల్ఎ బండారు సత్యానందరావు ఆధ్వర్యంలో జరిగే విజయోత్సవ ర్యాలీ జయప్రదం చేయాలని మండల టిడిపి అధ్యక్షుడు ఈదల సత్తిబాబు, కార్యదర్శి సలాది నాగేశ్వరావు పిలుపునిచ్చారు. అధిక సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు విచ్చేసి ర్యాలీ జయప్రదం చేయాలని వారు కోరారు.

పిల్లలు సహా వివాహిత అదృశ్యం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

పిల్లలతో సహా వివాహిత అదృశ్యంపై ధవళేశ్వరం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు జకినీకి దుర్గాదేవి, ప్రభుకుమార్ భార్యాభర్తలు. వారికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో ఆమె తన ఇద్దరు పిల్లలతో కలిసి ధవళేశ్వరం ఎర్రకొండ ప్రాంతంలో నివాసం ఉంటున్న తల్లిదండ్రుల వద్దకు వచ్చింది. మే 3న విశాఖలో తన భర్త వద్దకు వెళ్తున్నానని చెప్పి బయలు దేరింది. కాని ఆమె విశాఖలో ఆమె భర్త వద్దకు చేరలేదు. బంధువుల ఇళ్ల వద్ద వెతికినా ఆచూకీ దొరకలేదు. దీంతో దుర్గాదేవి తల్లి విజయలక్ష్మి మంగళవారం ధవళేశ్వరం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

సారా బట్టీపై దాడి

ప్రజాశక్తి - గోపాలపురం

మండలంలోని కరగపాడు గ్రామంలో సారా బట్టీపై దాడి చేసి ఒక వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పి.మనోహర్ మంగళవారం తెలిపారు. ఈ దాడుల్లో ఐదు లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకుని, వెయ్యి లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశామన్నారు. మండలంలో చట్ట వ్యతిరేక పనులు, అసాంఘిక కార్యక్రమాలు నిర్వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ప్రత్తిపాడులో పట్టపగలు భారీ చోరీ..

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడులో పట్టపగలు భారీ చోరీ చోటు చేసుకుంది. గ్రామంలోని కొత్తపేట వీధి శివారు జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న నివాసంలో దుండగులు చోరీకి పాల్పడ్డారు. ఘటనకు సంబంధించి పోలీసులు వివరాలు ఇలా ఉన్నాయి. కంటిపూడి శివానంద భాస్కర్ రావుకు చెందిన రెండంతస్తుల బిల్డింగులో యజమానులు లేని సమయంలో దుడంగులు చోరీకి పాల్పడ్డారు. సిఐ బి.సూర్య అప్పారావు, ఎస్ఐ లక్ష్మీకాంతం సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. ఆ కుటుంబ యజమాని వచ్చిన తర్వాత పూర్తి వివరాలు తెలియాల్సి ఉందన్నారు. చోరీ జరిగిన ఇంటిని మంగళవారం సాయంత్రం పెద్దాపురం డిఎస్‌పి శ్రీహరి రాజు పరిశీలించారు. ఈ చోరీకి ముగ్గురు దుండగులు పాల్పడినట్లు అనుమానిస్తున్నారు.

టిఎల్ఎంతో సులభతర బోధన

ప్రజాశక్తి - ముమ్మిడివరం

భవిత కేంద్రాలలోని వికలాంగ విద్యార్థులకు టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్(టిఎల్ఎం)తో సులభతర బోధన చేయవచ్చునని డిఇఒ డాక్టర్ షేక్ సలీంబాషా, సమగ్ర శిక్షా అదనపు ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ జి.మమ్మీ అన్నారు. మంగళవారం స్థానిక నగర పంచాయతీలో సమగ్ర శిక్షా సహిత విద్య జిల్లా కో-ఆర్డినేటర్ ఎంవివి.సత్యనారాయణ అధ్యక్షతన వికలాంగ చిన్నారులకు సులభతర బోధనపై ఐఇఆర్‌పిలకు టిఎల్ఎం వినియోగంపై ఒక రోజు శిక్షణా సదస్సు జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శారీరకంగాను, మానసిక వైకల్యం గల విద్యార్థులను ఆకట్టుకునేందుకు టిఎల్ఎం ఎంతగానో ఉపకరిస్తుందన్నారు. సహిత విద్య జిల్లా కోఆర్డినేటర్ సత్యనారాయణ మాట్లాడుతూ జిల్లాలోని 22 భవిత కేంద్రాలకు రూ.1.60 లక్షల విలువైన టిఎల్ఎం కిట్లను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఐఇ కో-ఆర్డినేటర్ సత్యనారాయణను ఘనంగా సత్కరించారు. అనంతరం టిఎల్ఎం నిపుణులు టిఎల్ఎం తయారీ, వినియోగంపై అవగాహన కలించారు.ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్షా ఫైనాన్స్ అండ్ అకౌంట్స్ అధికారి జి.ప్రవీణ్‌కుమార్, సిఎంఒ బివివి.సుబ్రహ్మణ్యం, ఎఎంఒ పి.రాంబాబు, ఎపిఒ డాక్టర్ ఎంఎకె.భీమారావు, తదితరులు పాల్గొన్నారు.

భార్య జ్ఞాపకార్థం అన్నదానం

ప్రజాశక్తి - ముమ్మిడివరం

తన భార్య జ్ఞాపకార్థం పేదలకు అన్నా క్యాంటీన్‌లో మంగళవారం ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం అన్నదానాన్ని శ్రీ భవాని ఆటో మొబైల్స్ అధినేత యిళ్ల వీరవెంకటసాయి సత్యనారాయణ చేశారు. తన భార్య దుర్గా భవాని జ్ఞాపకార్థం మంగళవారం స్థానిక అన్న క్యాంటీన్‌లో పేదలకు ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా సత్యనారాయణ సేవా తత్పరతను పలువురు అభినందించారు.

ప్రతిభ పురస్కారం అందుకున్న శ్రీవాణి విద్యార్థులు

ప్రజాశక్తి - కాట్రేనికోన

అవార్డును అందుకుంటున్న హర్షితా

రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ప్రతిభ పురస్కారాన్ని తమ విద్యార్థి కొప్పిశెట్టి హర్షితాభాగ్య కలెక్టర్ చేతుల మీదుగా అందుకున్నట్లు శ్రీవాణి విద్యాసంస్థల అధినేత తాతపూడి సుబ్బారావు తెలిపారు. పురస్కారాన్ని అందుకున్న చిన్నారిని వైస్ ప్రిన్సిపల్ టి.సత్యవతిదేవి, ఉపాధ్యాయు బృందం పి.వ్యాసమూర్తి శర్మ, కె.ప్రసాద్, ఎస్.కృష్ణ, శిరీష, గౌరీ, విద్యార్థినీ, విద్యార్థులు అభినందించారు.

KAKINADA MUNICIPAL CORPORATION
'e' PROCUREMENT NOTIFICATION

Roc No. 4283/2025/E2, **Dated: 10-06-2025**

Tenders invited through ap e procurement platform for 01 works, Tenders invited through offline tender for 02 works with an estimated amount value of **Rs. 10,33,825/-** from the eligible contractors in the following manner.

One Works for an amount of Rs. 3,33,825/-

Last date and time for downloading bid documents : Dt.16-06-2025 upto 10-00 AM
Last date and time for submission of bids : Dt. 16-06-2025 upto 10-30 AM

OFFLINE TENDER NOTIFICATION
Two Works for an amount of Rs. 7,00,000/-

Last date Tender Schedule payment in Municipal Corporation Treasury : 17-06-2025 upto 4-30 PM
Last date and time for Tender Schedule issue : 17-06-2025 upto 5-00 PM
Last date and time for Tender Schedule receiving : 18-06-2025 upto 4-00 PM

Tender Inviting Authority:
Commissioner, Municipal Corporation, Kakinada
Mail: kkd_mplcorp@yahoo.com
Call Centre Phone: 0884-2357722

Further details can be seen at 'e' procurement market place @ www.apeprocurement.gov.in

Sd/- **BHAWNA,** *I.A.S.,*
Commissioner, Municipal Corporation, Kakinada

మహారాజశ్రీ కాకినాడ 3వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో
E.P. No. 16/2020
O.S. No. 53/2009

Between:
M/s. సిటీ చిట్స్ & ఫైనాన్స్, కాకినాడ, Rep. by its Mg. Partner, మార్ని వెంకయ్య చౌదరి ...DHr
AND
యల్లాప్రగడ సుధాకర్, వగైరా ...JDrs

To:
యల్లాప్రగడ సుధాకర్, S/o. వెంకటానందం, పవన్ ఎంటర్‌ప్రైజెస్, HP గ్యాస్ కంపెనీ, సంగీతరావు పేట, సామర్లకోట. ...JDr-1

పై నెంబరు డిక్రీ అమలులో CPC Or 21, R 22 నోటీసుపై 1వ JDr అయిన మీ హాజరు నిమిత్తం వాయిదా **ది. 24-6-2025.** కాబట్టి మీకు ఏమైన ఆక్షేపణలు ఉన్న యెడల వాయిదా **తేదీ ఉదయం గం|| 10.30 ని||లకు** పై కోర్టు వారి ఎదుట హాజరయి తెలుపుకోవలెను.

వాయిదా : 24-6-2025

ఓరుగంటి సుధాకర్
కాకినాడ అడ్వకేట్, కాకినాడ
ది.02-6-25 సెల్:9441143021

మహారాజశ్రీ కాకినాడ ప్రిన్సిపల్ జూనియర్ సివిలు జడ్జి వారి కోర్టులో
O.S. No. 409/1985
E.P. No. 187/2018

Between:
మేడిశెట్టి బాబూరావు ...DHr
AND
1. మట్ట మంగయమ్మ (died)
2. మట్ట వెంకటరమణ (died)
3. మట్ట భాస్కరరావు (died)
4. మట్ట ప్రకాశరావు (died)
5. మట్ట కృష్ణ S/o. సూరన్న
6. బోన మంగాదేవి W/o. గణేష్
7. మట్ట సత్యవతి, W/o. భాస్కరరావు
8. మట్ట శ్రీనివాసరావు, S/o. భాస్కరరావు
9. మట్ట వీర వెంకట సత్యవేణి, W/o. భాస్కరరావు
10. మట్ట సాయికుమార్ యాదవ్, S/o. భాస్కరరావు
11. మట్ట సత్యవతి, W/o. ప్రకాశరావు
12. బెనబోయిన మకరజ్యోతి, W/o. వెంకట రమణ
13. మండిగండి హేమలత, W/o. లక్ష్మణుడు
14. మట్ట సంతోషి రూపాదేవి, D/o. ప్రకాశరావు

డో.నెం.44-12-5, పరదేశమ్మపేట, కాళే వారి వీధి, జగన్నాధపురం, కాకినాడ.

పై నెంబరు అమలులో CPC Or 21, R 34 నోటీసుపై మీ హాజరు నిమిత్తం వాయిదా ది. 27-6-2025. కాబట్టి మీకు ఏమైన ఆక్షేపణలు వున్న యెడల వాయిదా తేదీ అనగా **27-6-2025వ తేదీన ఉదయం గం|| 10.30 ని||లకు** పై కోర్టు వారి ఎదుట హాజరయి తెలుపుకోవలెను.

వాయిదా : 27-6-2025

ఓరుగంటి సుధాకర్
కాకినాడ అడ్వకేట్, కాకినాడ
ది.02-6-25 సెల్:9441143021

పాస్‌పోర్ట్ పోయినది

పశ్చిమగోదావరి జిల్లా, ఇరగవరం మండలం, ఓగిడి గ్రామానికి చెందిన ముప్పిడి నాగరాజు తూర్పుగోదావరి జిల్లా, పెరవలి మండలం అన్నవరప్పాడు గ్రామంలో తన అన్నయ్య ఇంటి వద్ద నివాసం ఉంటూ పాస్‌పోర్ట్ నెం - **N7196039** తీసుకుని పెరవలి జిరాక్స్ నిమిత్తం వెళుతుండగా మార్గ మధ్యలో పడిపోయినది దొరికిన వారు క్రింది అడ్రస్‌కు అందజేయగలరు.

అడ్రస్:
ముప్పిడి నాగరాజు
S/o. ముప్పిడి ఆనందం
డో.నెం.-1-76, ఓగిడి గ్రామం
ఇరగవరం మండలం, పశ్చిమగోదావరి జిల్లా
ఫోన్ నెం: 7997814038

బహిరంగ ప్రకటన

నా క్లయింటు శ్రీమతి మూరా దేవమణి, W/o. నూకరాజు, ఇందిరాగాంధీ కాలనీ, ప్రత్తిపాడు గ్రామం, కాకినాడ జిల్లా మాకు ఇచ్చిన సంజాయిషీ మేరకు ఇచ్చిన బహిరంగ ప్రకటన.

కాకినాడ జిల్లా, ప్రత్తిపాడు మండలం, ప్రత్తిపాడు గ్రామం నందు సర్వే నెం. 345, బ్లాకు నెం. 8 నందు పాత డోర్ నెం. 8-82, క్రొత్త డోర్ నెం. 8-110 గల డాబా ఇల్లు, చర్చి, షాపు కలదు. నా క్లయింటు తల్లిగారైన పులగపూరి జయమణి, W/o. లేటు గంగరాజు గారు వ్రాయించిన వీలునామా ప్రకారం నా క్లయింటు సోదరీమణులు, సోదరులతో పాటు పై ఆస్తి యందు సమ వాటా నా క్లయింటుకు దకలు పడి సదరు ఆస్తి కుటుంబ సభ్యుల సమిష్టి హక్కు భుక్తములందున్నది.

కొందరు తప్పుడు పత్రములు సృష్టించి నా క్లయింటు ఆస్తిని అమ్ముటకు ప్రయత్నించుచున్నారు. నా క్లయింటు ప్రమేయము లేకుండా ఎవరైనను పై ఆస్తిపై ఎటువంటి లావాదేవీలు జరిపినను అవి చెల్లుబాటు కావు. అట్టి లావాదేవీలతో నా క్లయింటుకు ఎట్టి సంబంధము లేదని, చట్టపరంగా చెల్లనేరవని తెలియచేయడమైనది.

అర్తమూరి మోజెస్
రిటైర్డ్ అడిషనల్ డిస్ట్రిక్ట్ జడ్జి మరియు అడ్వకేట్
పిఠాపురం, సెల్: 9492743097

మహారాజశ్రీ అనపర్తి జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
I.A. No. 435/2023 in
O.S. No. 115/2019

Between:
ఆంధ్రాబ్యాంకు ప్రస్తుతం యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా, (రాయవరం బ్రాంచ్), రి|| బై అసిస్టెంట్ జనరల్ మేనేజర్ ***-పిటీషనర్/వాది***
AND
వక్కలంక వీర వెంకట సత్య సంతోష్ చిట్టి రామారావు మరియు వగైరా ***-రెస్పాండెంట్లు/ ప్రతివాదులు***

To:
1వ రెస్పాండెంటు/ 1వ ప్రతివాది: వక్కలంక వీర వెంకట సత్య సంతోష్ చిట్టి రామారావు, తండ్రి: శేషగిరిరావు, వయస్సు 28 సం||లు, డోర్ నెం. 5-77, సత్తెమ్మ వీధి, పందలపాక, బిక్కవోలు మండలం, తూర్పుగోదావరి జిల్లా.

2వ రెస్పాండెంటు/ 2వ ప్రతివాది: వక్కలంక శేషగిరిరావు, తండ్రి: వక్కలంక వీర వెంకట సత్య సంతోష్ చిట్టి రామారావు, వయస్సు 67 సం||లు, డోర్ నెం. 5-77, సత్తెమ్మ వీధి, పందలపాక, బిక్కవోలు మండలం, తూర్పుగోదావరి జిల్లా.

పై నెంబరు పిటిషన్ గ్రంధంలో రెస్పాండెంట్లు/ ప్రతివాదులు అయిన మీకు మహారాజశ్రీ పై కోర్టు వారి ద్వారా ఎన్నిసార్లు సమన్లు పంపిననూ తీసుకొనకుండా కాలయాపన చేయుచున్నందున మహారాజశ్రీ కోర్టు వారు మీ హాజరు నిమిత్తం పైన తెలిపిన పిటిషన్ **ది. 25-06-2025 సం||నకు వాయిదా వేసియున్నారు. కావున మీరు సదరు తేదీన ఉదయం గం|| 10.30 ని||లకు** పై కోర్టు వారి ఎదుట హాజరు కావలెను. లేని ఎడల మీ పరోక్షమున తీర్మానించబడుతుందని ఇందు మూలముగా తెలియజేయడమైనది.

(శ్రీ కోర్టు వారి అనుమతితో)

వి.వి.ఆర్.సుబ్రమణ్యం
అనపర్తి పిటిషనర్ తరపు అడ్వకేట్
ది.03-06-2025 అనపర్తి, సెల్:9912946959